నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | జులై 24, 2024 | www.navatelangana.com

రాత్రి వేళ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి : ఎస్పీ



నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సింధు శర్మ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లోని రికార్డులను, కేసులను పరిశీలించారు. పీటి కేసులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని, పాత కేసులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాలలో దొంగతనాలు జరగకుండా పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

టీయూలో భోజనంలో బొద్దింక




నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని న్యూ బాయ్స్ హాస్టల్లో రెండు రోజుల క్రితం మధ్యాహ్నం భోజనంలో పురుగులు వస్తున్నాయి. గత వారం నుంచి పురుగులు వస్తున్నా కూడా హాస్టల్ వార్డెన్ అండ్ కేర్ టేకర్లు సరిగ్గా పట్టించుకోకపోవడం వల్లనే ఈ సంఘటనలు జరుగుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలలో బాయ్స్ హాస్టల్లో ఇటువంటి సంఘటనలు ఎప్పటి నుంచో పునరాగం అవుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఏ రోజు కూడా హాస్టల్‌కు వచ్చి సమస్యల గురించి మాట్లాడిన సందర్భాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఈ విషయంపై రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేదల కడుపు కొట్టి
కార్పోరేట్‌లకు పంచే బడ్జెట్

- కేంద్రానికి తెలంగాణపై సవతితల్లి ప్రేమ
- వేతన జీవులకు ఊరటనివ్వలే
- అరకొర కేటాయింపులతో విద్యారంగం నిర్వీర్యం
- కేంద్ర బడ్జెట్‌పై పలువురి పెదవి విరుపు



నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై పలువురు పెదవి విరిచారు. ప్రజా సంక్షేమం ఏమీ పట్టలేదని, పేదల కడుపు కొట్టి బడా కార్పోరేట్‌లకు దోచిపెట్టే విధంగా బడ్జెట్ ఉందని విమర్శలు వ్యక్తమైయ్యాయి. దేశంలో ఉన్న రైతులను, మధ్యతరగతి ప్రజలను, సామాన్య ప్రజలను, వ్యవసాయ కూలీలను, కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి కేటాయింపులూ లేవని, కేవలం కార్పొరేట్లను సంతృప్తి పరచడమే కనిపించిందని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రూ. 48 లక్షలు ఇరవై ఒక్కవేల కోట్లతో బడ్జెట్ పెట్టినప్పటికీ కేవలం బీజేపీ, దాని భాగస్వామ పక్షాలు అధికారంలో ఉన్న కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పెద్దపీట వేశారని, తెలంగాణను పూర్తిగా విస్మరించారని ఆరోపణలు వ్యక్తమైయ్యాయి. రాష్ట్రంతో పాటు ఇటు జిల్లాకు ఎలాంటి కేటాయింపులు లేవని, రైల్వే పెండింగ్ ప్రాజెక్టుల ఊసెత్తలేదని పెదవి విరిచారు.

కేంద్రానికి రాష్ట్రంపై సవతితల్లి ప్రేమ

- సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో ఏ మాత్రం నిధులు కేటాయించకపోవడం రాష్ట్రం పట్ల బీజేపీ ప్రభుత్వానికి ఉన్న సవితి తల్లి ప్రేమను తెలియజేస్తుంది. నిజామాబాద్ జిల్లాలో పెండింగ్ పనులకు తగినన్ని నిధులను కేటాయించకుండా బోధన్-బీదర్ రైల్వే లైన్ ఏర్పాట్లు ఒక్క అడుగు ముందు వేయకుండా నిధులను కేటాయించకపోవడం దారుణం. మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించడంలో, జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేస్తామన్న విమానాశ్రయానికి నిధులను కేటాయించకుండా జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేశారు. ఈ బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు ఏ మాత్రం సంతృప్తి పరచలేదు. ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన బిజెపి ఎంపీలు ఈ బడ్జెట్ పట్ల నోరు మెదపకపోవడం సరైంది కాదని ఆయన విమర్శించారు.

నిరుద్యోగులకు, పేదలకు ఊరటనివ్వలే



- సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న రైతులు లను, మద్యతరగతి ప్రజలను, సామాన్య ప్రజలను, వ్యవసాయ కూలీలను, కార్మికుల కడుపు కొట్టి కార్పొరేట్ లకు దోచి పెట్టే బడ్జెట్ అని, కేవలం కార్పొరేట్లను సంతృప్తి పరచడం కోసం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ దేశంలో ఉన్న పేద ప్రజల కష్టాలను బాధలను తీర్చే బడ్జెట్ కాదని అన్నారు. ఆహార భద్రతా దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, ద్రవ్యోల్బణం పెరిగిందని స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఆహార భద్రతలో కేవలం బియ్యం, గోధుమ లతో పాటు నిత్యావసర వస్తువులు రేషన్ లో ఇవ్వాలి. దానిపై అదనంగా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. గత సంవత్సరం కంటే 5 శాతం తక్కువగా కేటాయింపులు చేసారనీ, ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిర్లక్ష్యం వహించారు. నిరుద్యోగులకు ఎలాంటి ఊరట నివ్వని బడ్జెట్ కేవలం కార్పొరేట్లను సంతృప్తి పరచడం కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని విమర్శించారు. తెలంగాణకు మొండి చేయ్యి చూపారని 8 మంది బిజెపి ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు సిగ్గు పడాల్సిన బడ్జెట్ అని విమర్శించారు.

తెలంగాణకు మొండిచేయి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



నవతెలంగాణ-కామారెడ్డి

దేశంలో మైనార్టీలు దళితులు మహిళలు తమ భద్రతపై ఆందోళన చెందుతున్నారని, కానీ బడ్జెట్‌లో మహిళల భద్రత ఊసెత్తలేదు. ఆంధ్ర, బీహార్‌కు ప్రకటించిన దాంట్లో తెలంగాణకు 25 శాతం కూడా ప్రకటించలేదు. మోదీ ప్రభుత్వం ఆర్భాటంగా పథకాలను తీసుకొస్తున్నామంటున్నా వాటి అమలుపై మాత్రం శ్రద్ధ కనబరచడం లేదు. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఏమైనా భారీగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశించాం కానీ దక్కింది శూన్యం అని మండిపడ్డారు. బడ్జెట్ మొత్తంలో తెలంగాణ ప్రస్తావన లేదు. రాష్ట్రం నుండి ఎనిమిది మంది బిజెపి ఎంపీలు గెలిచినా కేంద్రం మాత్రం తెలంగాణకు చిన్నచూపు చుసింది. ములుగు యూనివర్సిటీకి అదనపు నిధులు, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ.. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఊసే లేదు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేవటం లేదు. ఐఐఎం సహా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ వంటి కేంద్ర జాతీయ సంస్థలను ఇస్తారేమో అని ఎదురుచూసిన ఒక్కటి కూడా ఇవ్వలేదు. తెలంగాణ నుంచి ముంబై-నాగపూర్, బెంగళూరు-చెన్నై వంటి మార్గాల్లో పారిశ్రామిక కారిడార్లకు నిధులు అడిగినప్పటికీ వాటి గురించి స్పందన లేదు. మెగా పవర్ లూమ్ క్లస్టర్‌తో పాటు నూతన హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని అడిగిన కూడా కేంద్రం స్పందించలేదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు వెళ్లి ఢిల్లీలో అన్ని శాఖల మంత్రులను అడిగిన వాటిని కూడా పట్టించుకోలేదు. తెలంగాణలో 8 స్థానాలను బీజేపీ, పార్టీకు ఇస్తే ఏం జరిగిందో తెలంగాణ ప్రజలు ఆలోచించాలి.

రైతుల ప్రయోజనాలు విస్మరణ

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్



నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అంకెల గారడి బడ్జెట్. ఇది పేదలపై భారం మరింత వేసేది ఉంది. ఈ బడ్జెట్ ధనవంతులకు లాభాలు తీసుకొచ్చి విధంగా ఉంది. ముఖ్యంగా రెండు రాష్ట్రాలు బీహార్, ఆంధ్రప్రదేశ్‌లకు నిధులు కేటాయించి తెలంగాణను పూర్తిగా విస్మరించారు. రైతాంగానికి ఎలాంటి ప్రయోజనాలూ కల్పించలేకపోయారు.

బడ్జెట్‌లో 34 శాతం అప్పులతో
వికసిత భారత్ కల నెరవేరుతుందా..?

- టీయూ అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం పున్నయ్య



నవతెలంగాణ-డిచ్‌పల్లి

2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సామాన్య ప్రజలు మొదలుకొని వేతనజీవులు మధ్యతరగతి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూశారు. సామాన్యులకు, వేతనజీవులకు, మధ్యతరగతికి ప్రయోజనంలేదు. కార్పొరేట్లకే ఈ బడ్జెట్లో పెద్దపీటవేసినారు. అనేక ఆశలు, భారీ అంచనాల మధ్య వికసిత్ భారత్ లక్ష్యంగా రూ.48.21 లక్షల కోట్లుగా ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో మొత్తం ఆదాయం కేవలం రూ.32.07 లక్షల కోట్లు మాత్రమే ఇందులో పన్ను ఆదాయం రూ.28.83 లక్షల కోట్లు కాగా అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా వేసినారు. ఈ బడ్జెట్‌లో 34 శాతం అప్పులతో వికసిత భారత్ కలనెరవేరు తుందా అని ప్రశ్నించారు.

తక్కువ కేటాయింపులతో నాణ్యమైన ఉచిత విద్యా ఎలా సాధ్యం..?

- డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి శాంతన్

నవతెలంగాణ-ఆర్మూర్



విద్య రంగా అభివృద్ధి కోసం గతంలో నియమించిన వివిధ కమిషన్లు విద్యారంగానికి కనీసంగా బడ్జెట్‌లో 10 శాతం అయినా కేటాయించాలని సూచించినప్పటికీ ప్రస్తుత బడ్జెట్లో 2.66 శాతం కేటాయించడం మరోసారి నిరాశపరిచారు. ఈ కేటాయింపును బట్టి విద్యారంగానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని అర్థమవుతుంది. తగిన కేటాయింపులు లేకుండా అందరికీ నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదు అనే విషయం పాలకులు గుర్తించడం లేదు. ఈ బడ్జెట్ మధ్యతరగతి కుటుంబాలకు,పేదలకు, నాణ్యమైన విద్యను దూరం చేస్తుంది. విద్యను ప్రైవేటీకరించ దానికే ఉపయోగపడుతుంది. బడ్జెట్లో ఇంత తక్కువ కేటాయింపులు వలన కామన్ స్కూల్ విధానం నేరవేరడం కలగానే మిగిలిపోతుంది. విద్యా రంగ ప్రవేటీకరణకు ప్రోత్సహించడమే అవుతుంది అని అన్నారు. బడ్జెట్‌లో ఆదాయం పన్ను మినహాయింపులు పెంచకపోవడం వలన మధ్యతరగతి వేతన జీవులు కూడా బడ్జెట్ నిరాశ మిగిల్చింది. పాత విధానంలోని స్లాబులు మార్చకుండా కొత్త విధానంలో మాత్రమే కొంత వెసులుబాటు కల్పించడం వలన వేతన జీవులకు లాభమేమి జరగడం లేదు. బడ్జెట్ క్రమంగా వేతన జీవుల సేవింగ్స్ ప్రాధాన్యత ను తగ్గిస్తూ వస్తుంది. అని అన్నారు.

మధ్యతరగతి వేతన జీవులకు ఊరట దక్కలే

- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆదాయ పన్ను చెల్లించే మధ్యతరగతి వేతన జీవులకు ఈ బడ్జెట్‌లో నన్న కొంత ఊరట దక్కుతుందని ఆశించారు. ఐటీ స్లాబులను సవరించాలని, స్టాండర్డ్ డిడక్షన్ కనీసం లక్షకు పెంచాలనేది ప్రధాన డిమాండు. పన్ను మినహాయింపును ప్రస్తుతం మూడు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచడంతోపాటు పాత విధానంలో మినహా యింపులను కూడా పెంచుతారని ఆశించారు. తద్వారా వేతన జీవుల చేతిలో మరిన్ని డబ్బులు ఆడతాయని వారి కొనుగోలు సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థ మరింతగా కళకళలాడుతుందని ఆర్థిక నిపుణులు చెప్పారు. సేవింగ్స్ పథకాల ను ప్రోత్సహించాలి. 80 సీ కింద మినహాయింపు మొత్తం ఒకటిన్నర లక్షల నుండి 2014 సంవత్సరం నుండి ఇప్పటివరకు పెంచలేదు. స్లాబులలో ఎలాంటి మార్పు లేదు. సంపద పన్ను రెండు శాతం విధించినట్లయితే దేశంలో ప్రధాన సమస్యలైన విద్యా, వైద్యం అందరికీ అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉండేది.

తెలంగాణకు తీవ్ర అన్యాయం

- టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు. పక్క తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకున్నందుకు నరేంద్ర మోడీ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దానితోపాటు తెలంగాణ రాష్ట్రాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని బడ్జెట్లో కేటాయింపులు చేస్తే బాగుండేది. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సవితి తల్లి ప్రేమ చూపడం సరికాదు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్ర ప్రభుత్వం తమ బాధ్యతగా, రాష్ట్రలు అభివృద్ధి పథంలో ఉండేందుకు సరైన బడ్జెట్ కేటాయింపులు చేపట్టాలి.

వేతన జీవులను మోసం చేసిన కేంద్రం

టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, కే, రమణ

నవతెలంగాణ-కామారెడ్డి



కేంద్ర బడ్జెట్లో అంకెల గారడీతో పన్ను భారం పెంచుతూ వేతనజీవులను మోసం చేసింది. గత సంవత్సరం కొత్త రెజీంలో 7 లక్షల ఆదాయముంటే పన్ను మినహాయింపు వర్తించగా ఈ రోజు బడ్జెట్ లో ఆ మినహాయింపు తొలగించి, స్టాండర్డ్ డిడక్షన్ మాత్రం 75 వేలకు పెంచి ఉద్యోగులను దగా చేసిందన్నారు. ఇది సామాన్యులకు ఎంత మాత్రం ఊరట కలిగించేది కాదన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచింది

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగల్ల సురేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశ గురిచేసింది. ఉద్యోగులందర్నీ కొత్త ఆదాయ పన్ను స్లాబులలో మార్చడానికి అనుకూలంగా కొత్తగా ప్రవేశపెట్టిన ఆదాయ పన్ను స్లాబ్లలో మార్పులు చేసి, పాత పనులు చేసుకునే వారిని తీవ్ర నిరాశకు గురిచేసింది. గత పది సంవత్సరాలుగా ఆదాయ పన్ను మినహాయింపు పెంచాలని కోరుతున్నా పట్టించుకోలేదు. 80 సి కింద సేవింగ్‌ల పరిమితిని కూడా పెంచకపోవడం, విద్యాసంస్థలకు నిధులను భారీగా పెంచుతారని ఆశిస్తే నిరాశపరిచింది.

తెలంగాణపై కేంద్ర వివక్ష

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు మళ్ళీ నిరాశనే మిగిల్చింది. తెలంగాణపై కేంద్రానికి ఉన్న నిర్లక్ష్యాన్ని మోడీ ప్రభుత్వం చూయించింది. రాష్ట్రం నుండి ఇద్దరు కేంద్రంలో సహాయక మంత్రులుగా వున్నప్పడికి రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలం అయ్యారు. ధర్మపురి అరవింద్ ఐదు సంవత్సరాలు ఎంపీగా వుండి ఇప్పుడు మళ్ళీ ఎంపీ అయిన కూడా తన ప్రవర్తనలో ఆలోచనలో మార్పు రాలేదు. తెలంగాణ నుండి బిజెపికి నలుగురు వున్న ఎంపీలు రెట్టింతలు అయి ఎనిమిది మంది అయిన కూడా రాష్ట్రానికి నిధులు రాకుండా రాష్ట్రాన్ని ఎనిమిది ఇంతలు మోసం చేశారు. ఇది రాష్ట్రం పైన కేంద్ర ప్రభుత్వానికి వున్న చిన్న చూపుకు నిదర్శనం.

వేతన జీవులను నిరాశపరిచిన బడ్జెట్

- తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్





నవతెలంగాణ-నిజామాబాదు రూరల్

కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు 80 జ పొదుపును ప్రోత్సహించేలా లేదు. పొదుపు పథకాల్లో పాత పద్ధతినే కొనసాగిస్తూ వచ్చారు. ఆదాయపు పన్ను పరిమితిలో స్వల్ప మార్పులు చేసి అల్పాదాయ వర్గాలకు నిరాశ పరిచారు. గృహ రుణాల పై వడ్డీ పరిమితి ని పెంచలేదు. ఇలా అయితే ఉద్యోగ వర్గాల్లో కేంద్ర ప్రభుత్వం పై నమ్మకం పోయేలా ఉంది అని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బట్టు క్రిష్ణా రెడ్డి, రుద్రంగి ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై ప్రజలను పోరాటాల్లోకి కదిలించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజా సమస్యలపై ప్రజలను పోరాటంలోకి కదిలించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ రాకుండా మిత్రపక్షాలతో కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చిందని, అయినప్పటికీ ప్రజల్లో మతతత్వ భావజాలాన్ని పెంచి ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకు పోవాలని ఆలోచిస్తున్నట్టు తెలిపారు. మతతత్వ విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలను సమస్యలపై పోరాటాల్లోకి కదిలించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో వెనక పడుతుందని ఏ విధంగా ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు జరపటంలో ప్రణాళికను లేకుండా ముందుకు పోతున్నారని ఫలితంగా క్రమంగా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నదని చెప్పారు. ప్రజల అసంతృప్తిని ఉపయోగించుకొని బిజెపి మతతత్వ విధానాలతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని దీన్ని పార్టీ శ్రేణులు గ్రహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపైన పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించినప్పుడే ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుందని స్వతంత్ర కృషితో పాటు వామపక్ష ప్రజాసంఘాలను సమస్యలపైన కలుపుకొని పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ రమ, జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జై శంకర్ గౌడ్, వెంకటేష్, నూర్జహాన్, కమిటీ సభ్యులు వై గంగాధర్, నన్నే సబ్, గంగాధర్, సుజాత, రాములు, శిల్ప లింగం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోలే

- మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి
- పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబీకుల, బంధువుల ధర్నా

నవతెలంగాణ-దోమకొండ



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టిన పలువురు

ఓ భవన నిర్మాణం పనులలో విద్యుత్‌షాక్‌తో పిట్ల రాజయ్య(30) మృతి చెందాడని, అందుకు కారణమైన భవనం నిర్మాణం యజమాని, బిల్డింగ్ కాంట్రాక్టర్‌లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు, బంధువులు డిమాండ్ చేశారు. మంగళవారం దోమకొండ మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, కులస్తులు, గ్రామస్తులు పెద్దఎత్తు పోలీస్ స్టేషన్ వద్ద బైటయించి ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ గ్రామానికి చెందిన పిట్ల రాజయ్య (60) భవన నిర్మాణ కూలీగా ఓ భవనం నిర్మాణం కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే దోమకొండ గ్రామంలోని నాయకుడు శ్రీనివాస్ అనే వ్యక్తి నూతన భవనం నిర్మాణం పనులు జరుగుతున్న సమయంలో యజమాని మృతుడు కూలీని లైట్ వైర్ కనెక్షన్ పెట్టాలని చెప్పడంతో లైట్ సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌తో సోమవారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. మృతికి కారణం అయినా వారి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతికి కారకులపై కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీబీపేట ఎస్సై ప్రభాకర్, ఇంచార్జ్ ఎస్సై సుబ్రహ్మణ్యం చారి వారిని సముదయించి కేసు నమోదు చేసుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

వర్షాల ఇబ్బందులపై కంట్రోల్ రూం ఏర్పాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08462-220183కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కంట్రోల్ రూమ్ నిరంతరం 24/7 పని చేస్తుందని, ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా సమాచారం తెలుపవచ్చని అన్నారు. సమాచారం అందించిన వెంటనే వర్షాల తాకిడికి లోనైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్ తెలిపారు.

నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రిలో ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ శిబిరం

నవతెలంగాణ-ఏర్గట్ల

నిజామాబాద్ ఆర్.బి.ఎస్.కే ఆధ్వర్యంలో,అపోలో హాస్పిటల్ హైదరాబాద్ వారిచే ఈ నెల 26 వ తేదీన 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత గుండె వ్యాధి నిర్ధారణ, చికిత్సా శిబిరం నిర్వహించనున్నట్టు ఏర్గట్ల మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ తెలిపారు. ఈ క్యాంప్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నాలుగో అంతస్తులో ఉంటుందని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వివరాలకు 9392695890 , 9966999224 నంబర్లను సంప్రదించవచ్చని అన్నారు.

కౌమారదశపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు కౌమారదశపై అవగాహన

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం వర్డ్ స్వచ్ఛంద సంస్థ(ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్) నుండి కమ్యూనిటీ కోఆర్డినేటర్స్ మల్లేష్ మాట్లాడుతూ కౌమార దశలో వచ్చే మార్పుల గురించి శారీరిక, మానసిక సామాజిక మార్పుల గురించి విద్యార్థి విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైంగిక ఆరోగ్యం గురించి, పౌష్టిక ఆహారం, రక్తహీనత, హెచ్ఐవి ఎయిడ్స్, చట్టాల పైన అవగాహన కల్పిస్తూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సంస్థ అధికారులు ఎస్ రాజకళ, ఎంసి రాజు, గారు ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 25న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కే లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు మెడిప్లస్ కంపెనీ వారు ఫార్మసిస్ట్, జూ. అసిస్టెట్, ఆడిట్ అసిస్టెంట్, ఉద్యోగాల నియామకాలు చేపడుతారు. అర్హతలు పదవతరగతి, ఇంటర్మీడియేట్, డీగ్రీ, డీఫార్మసీ, ఎంఫార్మసీ విత్ పిసిఐ పాసైన వారు అర్హులు ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీ నగర్, నిజామాబాద్ నందు ఈనెల 25న ఉద్యోగ మేళ ఉదయం 10.30 గంటలకు ఉంటుందని తెలిపారు. వివరాలకు, 9581768413, 9948748428, 6305743423, 9959456793 ఫోన్ ద్వారా సంప్రదించాలని అభ్యర్థులు తమ బయో డేటా, ఆదరికార్డు, పదవ తరగతి మెమో, పాస్పోర్ట్ఫోటో తీసుకురావాలని తెలిపారు.

అధికారుల బదిలీలు

నవతెలంగాణ-ముప్కాల్

ఎంపీవో భరత్ చంద్రతో పాటు మరో ముగ్గురు పంచాయతీ సెక్రటరీలు బదిలీపై వెళ్లారని ఎంపీడీవో మహమ్మద్ ముజాఫరోద్దీన్ మంగళవారం వెల్లడించారు. రెంజర్ల గ్రామపంచాయతీ సెక్రటరీగా పనిచేసిన శ్రీనివాస్ చందూర్‌కు వెళ్లగా, నల్లూర్ పంచాయతీ సెక్రటరీ శంకర్, కొత్తపల్లి సెక్రటరీ భరత్ స్వరూప్‌లు బదిలీలపై మరో గ్రామానికి వెళ్లారని తెలిపారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీగా ఎస్. రాజు, నల్లూర్ కె.విఘ్నేష్, రెంజర్ల గ్రామ సెక్రటరీగా టీ.నగేష్ బాధ్యతలను చేపట్టారు. ముప్కాల్ ఎంపీవో భరత్ చంద్ర మెండోరా మండలానికి బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో రెంజల్ మండలానికి చెందిన ఎంపీవో మహమ్మద్ గౌస్ బాధ్యతలు స్వీకరించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయతీ కార్యదర్శిలు, మండల పంచాయతీ అధికారి, మండల పరిషత్‌లోని సీనియర్ అసిస్టెంట్ బదిలీ అయ్యారు. మహేష్ జలాల్ పూర్ నుంచి మెండోరా మండలం నడిమి తండా, డి విద్యాసాగర్ బస్సాపూర్ నుంచి ఆర్మూర్ మండలం మగ్గిడి, శ్రీధర్ చిట్టాపూర్ నుంచి నిజామాబాద్ రూరల్ మల్కాపూర్ తాండ కు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నవీన్ నిజామాబాద్ జిల్లా పరిషత్, టైపిస్ట్ రవి వేల్పూర్ కు బదిలీ అయ్యారు. ఎంపీఓ వెంకటేశ్వర్లు మోస్ర మండలానికి బదిలీ కాగా భీంగల్ నుంచి గంగా మోహన్ సీనియర్ అసిస్టెంట్‌గా, వేల్పూర్ నుంచి సుమిత ఇక్కడకు బదిలీ అయ్యారు. వీరు మంగళవారం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చందమియబాగ్ గ్రామపంచాయతీ కార్యదర్శి కూర శ్రీనివాస్ బదిలీపై వెళ్తుండగా గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. 5 సంవత్సరాలుగా చంద మియాబాగ్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కూర శ్రీనివాస్ ఆర్మూర్ మండలం దేగం గ్రామానికి బదిలీ అయ్యారు. మాజీ సర్పంచ్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్ నాయక్, కారోబార్ దేవిచంద్, గ్రామస్తులు పాల్గొన్నారు

మోపాల్ ఎంపీఒగా కిరణ్



సన్మానించిన పలువురు

నవతెలంగాణ మోపాల్

పంచాయతీరాజ్ బదిలీల్లో భాగంగా మోపాల్ మండలం నూతన ఎంపీ ఓగా కిరణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నందిపేట్ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చానని ఆయన తెలిపారు. అలాగే ఇక్కడ పనిచేసిన ఇక్బాల్ నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎంపీ ఓను, బదిలీ అయినా ఇక్బాల్‌ను పంచాయతీ సెక్రెటరీలు, ఎంపీడీవో లింగం నాయక్, సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీలు ధీరజ్, మృదుల, హరీష్ మల్లేష్, ఆర్మీ రాజు, నవీన్, సాయి, చైతన్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు

నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుల బదిలీలు ఆపాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో పనిచే స్తున్న కార్మికుల బదిలీల పేరుతో ఆందోళన గురిచేస్తున్నారని ఆ ప్రయత్నాన్ని ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని పద్ధతిలో కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని బదిలీ చేయాలిగా నిజామాబాద్ నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు బదిలీ చేస్తామనటం సరికాదన్నారు. అనేక సంవత్సరాలుగా సీనియార్టీ ప్రకారం కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని, స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని, రెగ్యులర్గా రావలసిన సబ్బులు, చెప్పులు, నూనెలు, యూనిఫారాలు ఇవ్వాలని అడుగుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి. నర్సింగరావు, నాయకులు నరసయ్య, ఒడ్డెమ్మ, చిన్న సాయమ్మ, రజిని, రాజేందర్, కార్మికులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు

జిజిహెచ్‌లో సందర్శించిన న్యూఢిల్లీ ప్రత్యేక కేంద్ర బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్షయ వ్యాధిని నిర్మూలించడానికి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేకమైన సేవలు అందుబాటులో ఉన్నట్టు నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమ రాజ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యూఢిల్లీ నుండి ప్రభుత్వ ఆసుపత్రులలో గాలి ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణ బృందం వచ్చారని తెలిపారు. గాలి ద్వారా సంక్రమించే వ్యాధులలో ప్రధానంగా క్షయ(టి.బి) ముఖ్యమైనదని, ఇది దగ్గు, జలుబు ద్వారా మాత్రమే కాకుండా అంతర్గత అవయవాల తీవ్రతను బట్టి రావచ్చునని అలాగే రాత్రిపూట చెమటలు, జ్వరం, దీర్ఘకాలిక దగ్గు, ఆకలి మందగించడం, నిద్రలేమి, బరువు తగ్గడం ఇలాంటి లక్షణాలను కలిగి ఉన్నప్పుడు కూడా క్షయవ్యాధి రావచ్చునని అలాంటి సందర్భంలో పరీక్షలు చేయించుకొని నిర్ధారణ చేసుకోవాలని తెలియజేశారు. అంతేకాకుండా క్షయ వ్యాధి ఉన్నవారిలో డ్రగ్ రెసిస్టెన్సీ కారణంగా మళ్లీ పునరావృతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా వీటన్నింటికీ ఆసుపత్రిలో చికిత్స ఉంటుందని ప్రజలు సరైన అవగాహనతో చికిత్సను చేయించుకోగలరని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చిన డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 185 క్షయ వ్యాధి నిర్మూలన కేంద్రాలలో నిజామాబాద్ ఒకటని, అందుకే ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. నిజామాబాద్ జీజీహెచ్‌లో క్షయ వ్యాధి నిర్మూలనపై తగిన చర్యల పైన సమీక్ష నిర్వహించామని తెలిపారు. అన్ని రకాల నియంత్రణ చర్యలను పాటిస్తున్నట్లు, ముఖ్యంగా సిబ్బందికి వ్యాక్సినేషన్ ఏర్పాటు చేయడం, ప్రతి వారం హెచ్ఐసీసీ (హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ) ద్వారా సమీక్షలు నిర్వహించడం అభినందనీయం జీజీహెచ్‌కు విచ్చేస్తున్న రోగులకు క్షయ(టి.బి) పై అవగాహన కల్పించే విధంగా సూచనలను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ భరత్ కుమార్, ప్రమోద్ రెడ్డి, జీజీహెచ్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి

- ఆన్లైన్ సమస్య తలెత్తకుండా చూడాలి
- అదనపు కలెక్టర్ అంకిత్
- ప్రజా పాలన కేంద్రం తనిఖీ
- కమ్మర్‌పల్లిలో కస్తూర్బా పాఠశాల తనిఖీ



కమ్మర్‌పల్లి: రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



మోర్తాడ్‌లో...

నవతెలంగాణ-మోర్తాడ్/కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సేవా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం పరిశీలించారు. ప్రజా పాలన దరఖాస్తులు ఆన్లైన్ లో ఇబ్బందులు కలుగుతున్నాయన్న సమాచారం మేరకు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా పాలన ఇబ్బందులను దరఖాస్తులు పరిశీలనకు ప్రజలు అధిక సంఖ్యలో మండల కార్యాలయానికి తరలిరావడం వాటి సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం మేరకు ఆన్లైన్ సమస్య తలెత్తకుండా తక్షణ పరిష్కార మార్గాలను చేపట్టాలని సూచించారు. వీటితోపాటు దరఖాస్తుదారుల రిజిస్టర్ రికార్డులను ఆయన తనిఖీ పరిశీలించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి మధుసూదన్,

ఎంపీడీవో తిరుమల, ఎంపీ ఓ శ్రీధర్ ఉన్నారు.

కమ్మర్‌పల్లి : మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ప్రజా పాలన కేంద్రాల పనితీరు, కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును ఆయన పరిశీలించారు. లబ్దిదారుల నుండి వచ్చిన దరఖాస్తులను ఆన్ లైన్ చేస్తున్న తీరును ఆయన కంప్యూటర్ ఆపరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఆరు గ్యారెంటీల అమలులో లబ్ధిదారులు అందించే దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చేయాలని కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. ప్రజా పాలన కేంద్రం నిర్వహణ పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కంప్యూటర్ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

వన మహోత్సవంలో భాగంగా గ్రామంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిషత్ కాంప్లెక్స్ లో వన మహోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. నాగపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వరద కాలువ గట్టుపైన ఏర్పాటు చేసిన కమ్యూనిటీ ప్లాంటేషన్ బ్లాకును సందర్శించి వన మహోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, మొక్కలను సంరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్‌కు సూచించారు. మొక్కలు నాటితే సరిపోదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారం అన్నారు. ప్రస్తుతం మనం నాటిన మొక్కలే వృక్షాలై మన భవిష్యత్తు తరాలకు ప్రాణ వాయువును అందిస్తాయన్నారు. నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రజలు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు మొక్కలకు కంచెలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయన నాగపూర్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సందర్శించి పరిశీలించారు. అంతకుముందు ఆయన కమ్మర్ పల్లిలో పల్లెపకృతి వనంను సందర్శించి, పకృతి వనం నిర్వహణ తీరును, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, తహసిల్దార్ ఆంజనేయులు, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శులు శాంతి కుమార్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగదిని, మరుగుదొడ్లు, మూత్రశాలలను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వంటగదిలో నిలువ ఉన్న కూరగాయలను, ఆహార ధాన్యాల నాణ్యతలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు ఏమైనా అనారోగ్య సమస్యలు ఉంటే తక్షణమే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించాలని పాఠశాల ప్రత్యేక అధికారిని గంగామణికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, తహసిల్దార్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, తదితరులు ఉన్నారు.


ఛాత్రోపాధ్యాయుల సమక్షంలోనే విచారణ చేస్తాం

- పిడీఎస్‌యూ నాయకులకు ఆర్జేడి హామీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో గల డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ పై ఛాత్రోపాధ్యాయులు, పిడిఎస్‌యు నాయకులు చేసిన ఫిర్యాదులపై వరంగల్ విచారణ చేపడతామని ఆర్జెడి సత్యనారాయణ తెలిపారని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ అన్నారు. మంగళవారం ఆర్జేడీ విచారణ నిమిత్తం నిజామాబాద్‌కు రాగా ఆయన్ను కలిసి మాట్లాడామని తెలిపారు. డైట్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీనివాస్ చాత్రోపాధ్యాయులను మానసికంగా వేధించారని, ఆర్థిక అవినీతికి పాల్పడ్డారని, 34 సంవత్సరాలుగా రూల్స్‌కు విరుద్ధంగా ఒకే చోట ఉద్యోగం చేస్తున్నారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్యు) నగర కమిటీ ఆధ్వర్యంలో చాత్రోపాధ్యాయులు విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందన్నారు. విచారణ నిమిత్తం ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి డైట్ కళాశాలకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఐతే చాత్రోపాధ్యాయులు (విద్యార్థులు) తమ టీచింగ్ ప్రాక్టీస్ కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు, కొంతమంది డీఎస్సి పరీక్షల కోసం వెళ్లడం జరిగిందని తెలిపారు. ఏకపక్ష విచారణను వాయిదా వేసి, ఫిర్యాదు చేసిన చాత్రోపాధ్యాయులు, పిడిఎస్‌యూ నాయకుల సమక్షంలో మాత్రమే విచారణ చేపట్టాల్సిందిగా ఆర్జెడి ని కోరామన్నారు. ఆర్జెడి సత్యనారాయణ సానుకూలంగా స్పందిస్తూ పిడిఎస్‌యూ నాయకులు, ఛాత్రోపాధ్యాయుల సమక్షంలోనే మరోసారి డైట్ కాలేజీకి వచ్చి విచారణ చేపడతారని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు విద్యార్థి నాయకులు నసీర్, సృజన్,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటిపల్లి రామ్ గోపాల్‌రెడ్డి మృతి తీరని లోటు



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

బిజెపి నిజామాబాద్ పట్టణ అధ్యక్షుడుగా, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షుడిగా సేవలందించిన కాటిపల్లి రామ్ గోపాల్ రెడ్డి మరణం పార్టీకి తీరని లోటు అని, మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీ నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంకితభావంతో అందరికి అండ దండగ ఉంటూ, పార్టీకి, కార్యకర్తలకు సేవచేశారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలో బీజేపీ పార్టీ మండలాధ్యక్షులు ఏలేటి నారాయణరెడ్డి అధ్యక్షతన బీజేపీ పార్టీ మండల కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బీజేపి జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ హాజరై మాట్లాడారు. రాబోయే కాలంలో పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త శ్రమించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను, హామీలను అమలు చేయాలని, లేకుంటే ప్రజల తరపున పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమా రాజారెడ్డి,మాజీ ఎంపీటీసీ బొల్లి శంకర్, నాయకులు అడ్వాల గంగాధర్, లోలం రమేష్ రెడ్డి,ఘన శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, గంగేష్, బద్దం సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్

మండల బీజేపీ పార్టీ సమావేశం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్మూర్ పట్టణ కేంద్రానికి చెందిన జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు పుప్పాల శివరాజ్ హాజరయ్యారు. రానున్న రోజుల్లో పార్టీ చేపట్టే కార్యకలాపాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం పుప్పాల శివరాజ్ ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గడ్డం సంతోష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, ముస్కు నర్సయ్య, మెడికల్ విక్రమ్, చిల్కా దినేష్, నర్సయ్య కెయం.రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ వివరాలు తెలుసుకున్న ఏఈఓ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామ పరిధిలోని రైతు రుణమాఫీ వివరాలను మంగళవారం ఏఈఓ సాయి సచిన్ క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకున్నారు.లక్ష రుణమాఫీ కానీ రైతుల వివరాలను ఆన్లైన్ లో చూసి ఎందుకు కాలేదో వారికి వివరించారు. తప్పులు దొర్లిన రైతుల వివరాలను సరిచేయించుకోవాలని వారికి సూచించారు.

సీసీ డ్రైనేజీ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని 19వ డివిజన్ కంఠేశ్వర్ రోకడ హనుమాన్ అలయం వద్ద 3 లక్షల నిధులతో నిర్మించే సీసీ డ్రైనేజీ పనులకు నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ మంగళవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మీసాల సవిత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, కాలని ప్రజలు పాల్గొన్నారు.

ఊర పండుగ సందర్భంగా బండారు



ఊర పండుగను నిర్వహిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ సర్వసమాజ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 28 ఆదివారం నాడు జరుగబోయే ఊర పండుగలో భాగంగా తేది మంగళవారం శ్రీ విజయ్ కిసాన్ మున్నూరు కాపు సంఘం, గాజులపేట్ వారి అధ్వర్యంలో బండారు పోశారు. ఈ సందర్భంగా అనాదిగా వస్తున్నా ఆచారంలో భాగంగా పిల్లలు, పెద్దలు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు, పశు సంపద దిన దినా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్టు సర్వసమాజ్ కమిటీ కో. కన్వీనర్ ఆదే ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సుంకటి ప్రవీణ్, ఉపాధ్యక్షులు పట్టే వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి పాలంచ గంగాధర్, సంయుక్త కార్యదర్శి కోరడి గోపి, కోశాధికారి భైర గంగ శైలేందర్ మరియు పెద్దకాపులు కోరడి పెద్ద నర్సయ్య, కోటకింది నర్సయ్య, కోర్వ భూపాల్, భైర గంగ ప్రసాద్, మల్కాయ్ లక్ష్మినారాయణ మరియు కొత్మీర్ సతీష్, జానకంపేట్ అశోక్, రామాడ్గు బాలకిషన్, మల్కాయి సుదర్శన్, గంట పెద్ద నర్సయ్య, సుంకటి భూమన్న, మల్కాయ్ భోజన్న, కొరడి నడ్పి నర్సయ్య, ఆదే నర్సయ్య, నరాల చక్రధర్, బెల్లల్ నాగ భూషణ్, కొట్టె సాయిబాబా, సుంకటి రమేష్, మల్కాయి మహేందర్, భైర ప్రసాద్, అన్నారం జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన



వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించి తనిఖీలను నిర్వహించారు. అందులో భాగంగా దుబ్బ ప్రాంతంలోని పిహెచ్సిని తనిఖీ చేశారు. స్థానిక ప్రజలకు పిహెచ్‌సీల్లో ఎలాంటి సేవలు అందిస్తున్నారు, అలాగే ఎలాంటి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు, ఎలా అవగాహన కల్పిస్తున్నారని అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్లమ్మ గుట్టలోని గవర్నమెంట్ హైస్కూల్ పోలీస్ లైన్‌లో పర్యటించారు. అక్కడ విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సందర్భంగా పలు ప్రాంతాలలో మొక్కలను నాటారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఘనవిజయం



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షులు ఈరవత్రి రాజశేఖర్

నవతెలంగాణ-ఆర్మూర్

మంచిర్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా విద్యార్థులు ఐదుగురు విజయం సాధించినట్టు తైక్వాండో ప్రధాన కార్యదర్శి కరాటే భోజన్న మంగళవారం తెలిపారు. మొత్తం 850 మంది పాల్గొన్నారని అన్నారు. జిల్లానుండి 9 మంది బాలురు, ఇద్దరు బాలికలు పాల్గొనగా అందులో ఐదుగురు విజేతలుగా నిలిచారని తెలిపారు. దుర్గా భవాని, రవళి, జలీల్ బ్రాంజ్ మెడల్స్, అథ్విక్, శీనిధ్ సిల్వర్ మెడల్స్ సాధించారని అన్నారు. వీరిని గ్రాండ్ మాస్టర్ కరాటే భోజన్న, జిల్లా అధ్యక్షులు ఈరవత్రి రాజశేఖర్ తదితరులు అభినందించారు.

సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజాంబాద్ నగరంలోని ఆర్య నగర్లో గల శ్రీ మార్ట్ (సూపర్ మార్కెట్) లో అగ్ని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు మంగళవారం తెలిపారు. నగరంలోని ఆర్యనగర్‌లోగల శ్రీ మార్ట్ సూపర్ మార్కెట్‌లో సోమవారం అర్ధ రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు రేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశామని, సుమారు పది లక్షల విలువ చేసే మార్ట్‌లోని సామాను కాలిపోయిందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
బుధవారం | జులై 24, 2024 | www.navatelangana.com

డ్రైనేజీ నిర్మించి పరిశుభ్రతను కాపాడాలి

- బీబీపేట్ మండల కేంద్రంలోని ఒకటో వార్డు ప్రజల ఆవేదన



నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలంలోని ఒకటో వార్డులో డ్రైనేజీ లేక నీరు రోడ్డుపై ప్రవహిస్తూ దోమలు, పందులు తదితర వాటితో తమకు ఇబ్బంది కలుగుతుందని డ్రైనేజీ నిర్మించి బాధలను తొలగించాలని ఒకటో వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీబీపేట్ మండల కేంద్రంలో గల ఎస్సీ కాలనీలో తమ వార్డులో డ్రైనేజీ లేక డ్రైనేజీ నీరుతో వర్షపు నీటితో తమ కాలనీలు చెరువులా తయారవుతున్నాయని దీంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. తమ వార్డు సమస్యలపై గ్రామ పంచాయతీకి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా స్పెషల్ ఆఫీసర్, ఈవో చొరవ తీసుకుని డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బిఎంఎస్ యూనియన్ జెండావిష్కరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో బిఎంఎస్ యూనియన్ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బిఎంఎస్ యూనియన్ 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆటో యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శివకుమార్, యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయగౌడ్‌తో పాటు ఆటో డ్రైవర్లు జయరాం, బషీర్, ఖదీర్, మహేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



జెండాఆవిష్కరించిన నాయకులు

ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా భోలేశ్వర్



భోలేశ్వర్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

ధర్మ సమాజ్ పార్టీ కామారెడ్డి జిల్లా కన్వీనర్‌గా ఉగ్రవాయి భోలేశ్వర్‌ను నియమించినట్లు రాష్ట్ర కమిటీ మెంబర్ సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.విశారదన్ మహారాజు ఆదేశాల మేరకు బోలేశ్వర్‌ను కామారెడ్డి జిల్లా కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, అరవింద్, రాజు, బుమయ్య, గంగరాజు, పర్శరాములు, సాయి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్‌లో వైద్య శిబిరం

- పలువురి రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని స్థానిక గ్రామ సచివాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రక్త నమూనాలను సేకరించినట్టు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. గ్రామంలో పలువురు అనారోగ్యాలకు గురై అవస్థలు పడుతుండడంతో విషజ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రక్తనమూనాలను సేకరించినట్టు వివరించారు. వాటిని పరిశోధన నిమిత్తం జిల్లా కేంద్రానికి పంపినట్టు తెలిపారు. వారం రోజులపాటు ఇంటింటికి తిరిగి గ్రామంలో సర్వే నిర్వహించామని సర్వే ఆధారంగా జ్వరాల బారిన పడిన వారి వివరాలను నమోదు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన ప్రవీణ్ కుటుంబానికి ముగ్గురు కానిస్టేబుల్లు ఎల్లారెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రంజిత్‌గౌడ్ రూ.4000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అవయవదానం చేసి మరొకరికి ప్రాణదానం చేసిన ప్రవీణ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య ఏఐఎఫ్‌డిఎస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జబ్బర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి షరతులు లేకుండా స్కాలర్షిప్ ఫీజు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి వసతి గృహాల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అలాగే కొన్ని వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పై సమస్యలన్నింటినీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఏఐఎఫ్‌డీఎస్ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు సురేష్, ఫయాజ్, ప్రణీత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సరైన సమయంలో బస్సులు నడపాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ
- ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



నవతెలంగాణ-కామారెడ్డి

ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరైన సమయంలో బస్సులు నడపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అధికారులను ఆదేశించారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని టిజిఆర్‌టిసి కొత్త బస్టాండ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గెలిచిన తొందరలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు. కామారెడ్డి బస్టాండ్‌లో బస్సులో ఉన్న మహిళలతో ఆమె మాట్లాడి మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. డిపో మేనేజర్‌తో మాట్లాడి కామారెడ్డిలో ఉన్న బస్సులు ఎన్ని, అవి సరైన సమయంలో నడపాలని, అలాగే కాలేజ్ విద్యార్థులకు ఇబ్బంది కాకుండా చూడాలని, అరుణాచలంకు సైతం బస్సు కేటాయించాలని సూచించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మంచినీళ్ల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిపో మేనేజర్ ఇందిరాను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్ పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, సలీం, పంపరి శీను, అనూష ప్రసన్న, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యాన్ని కల్పించాలి

- ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థులకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో డిపో మేనేజర్ కార్యాలయం ముందు ఏబీవీపీ నాయకులు విద్యార్థులతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల నుంచి చిన్న మల్లారెడ్డి గ్రామంలో ఉన్నటువంటి 60పైగా విద్యార్థులకు బస్సు సదుపాయం సరిగ్గా లేక కాలేజీకి వెళ్లడం ఆలస్యమవుతుందన్నారు. చిన్నమల్లారెడ్డి గ్రామానికి వచ్చే బస్సులు ముందే నిండిపోయి వస్తున్నాయని, కావున అందులో చిన్నమల్లారెడ్డి విద్యార్థులు పట్టలేకపోతున్నారని తెలిపారు. అందువల్ల విద్యార్థులందరూ సైకిల్ మీద, బైకు మీదను లేదా నడుచుకుంటూ కాలేజీకి వచ్చేసరికి కాలేజీకి వెళ్లడం చాలా ఆలస్యమైపోతుందని, దానివల్ల సిలబస్ మిస్ అయిపోతున్నారని వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, జిల్లా నాయకులు అల్తాఫ్, నవీన్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గత కొన్ని సంవత్సరాల నుంచి విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న నిజాముద్దీన్, గంగాధర్, సుమలత తదితర ఉపాధ్యాయులను మంగళవారం గ్రామపెద్దలు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభా, మాజీ సొసైటీ చైర్మెన్ మారుతి పటేల్, అశోక్, పాఠశాల చైర్మెన్ సోన్ కాంబ్లె, సాయిలు, రమేష్, చిద్రపు లక్ష్మణ్, శ్యామ్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దుకాణ సముదాయాన్ని పరిశీలించిన డీపీవో

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన నిర్మించిన దుకాణ సముదాయాన్ని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. దుకాణ సముదాయ నిర్మాణం చేపట్టిన స్థలం వివాదాస్పదంగా మారడంతో బిచ్కుందకు చెందిన కొందరు కోర్టుకెళ్లారు. కోర్టు ఆదేశాలతో నిర్మాణం చేపట్టిన స్థలాన్ని పరిశీలించి పూర్తి నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశించడంతో ఇరుపక్షాల వద్ద ఉన్న డాక్యుమెంట్లు ఇతరత్రా పత్రాలను వారి వద్ద నుండి తీసుకున్నారు. ఇరుపక్షాల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి పూర్తి నివేదికతో కోర్టుకు సమర్పించనున్నట్టు డీపీవో తెలిపారు. ఆయన వెంట డిఎల్‌పిఓ నాగరాజు, ఎంపీఓలు మహబూబ్, అబ్బగౌడ్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 153 గ్రామ కార్యదర్శులు బదిలీ..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 323 గ్రేట్ 4 కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారని ఒకే చోట ఐదు సంవత్సరాలు నిధులు నిర్వహించిన 153 మంది గ్రామ కార్యదర్శులు బదిలీలు జరిగాయని ప్రస్తుతం 22 గ్రామపంచాయతీలలో ఖాళీలు ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న పలువురు

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్ పోస్టుకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన స్థానంలో హెడ్ కుక్ పోస్ట్ ఖాళీ అయ్యిందని, ఆ పోస్టుకు ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. హెడ్ కుక్ పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణులై, జూలై ఫస్ట్ 2024 నాటికి 18 సంవత్సరాల పైబడి 45 సంవత్సరాల లోపు కలిగి ఉండాలన్నారు. పెద్ద సమూహాలలో వంట చేసిన అనుభవం కలిగి ఉండాలని, ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 27లోపు రెంజల్ కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సమర్పించాలని ఆయన సూచించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి అన్నారు. బుధవారం కామారెడ్డిలో ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, మందకృష్ణ మాదిగ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ బట్ట వెంకట్, రాములు, యాదయ్య, రమేష్, రాజనర్సు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వేద గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వేద గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఎండస్కోపీ కొలనాస్కోపీ శిబిరం గతంలో నిర్వహించడంతో ఈ క్యాంపు విషయం తెలవని కొందరు ఉచిత క్యాంప్ తిరిగి నిర్వహించాలని కోరడంతో మంగళ, బుధవారాలలో ఉచిత క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఈ ఉచిత ఎండోస్కోపీ కొలనోస్కోపీ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ క్యాంపులో రూ.5800 విలువ కలిగిన ఎండోస్కోపీ, కొలనోస్కోపి, ల్యాబ్ టెస్టులు వారి వారి అవసరాలను బట్టి పూర్తిగా ఉచితంగా చేయనున్నట్టు వివరించారు. రిజిస్ట్రేషన్ ఫీజు కేవలం రూ.500 మాత్రమేనని, మరిన్ని వివరాలకు 8000600330 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని సూచించారు.

ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన పలువురు



ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఒకటో వార్డులో ఆ కాలనీవాసులు మంగళవారం ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఆమ్ ఆద్మీ పార్టీ బోధన్ కన్వీనర్ జునైద్ అహ్మద్ ఖలీల్ వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన పని విధానాన్ని చూసి ఆకర్షితులై కాలనీకి చెందిన 50 మంది కాలనీవాసులు పార్టీలో చేరారని ఆయన తెలిపారు. నిరుపేదల సమస్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ నిరంతరం ముందుండి పోరాడుతుందని అన్నారు.

సైన్యసేనా ఆధ్వర్యంలో ఉచిత భోజనం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని సైన్యసేన ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉచిత భోజన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సైన్యాసేన వ్యవస్థాపకులు ఎర్రోళ్ల నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా భారీ వర్షాల కారణంగా ఎవరూ లేక అన్నార్థులుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో అక్కడక్కడ యాచన చేసుకొని నివసిస్తున్న వారు భోజనం లేక ఆకలితో అలమటిస్తున్న వారికి భోజన సదుపాయాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు.

చెరువుల్లో జలకళ



వర్షంతో నిండిన చెరువు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లోని చెరువుల్లో జళకళ సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి కొత్త నీరు రావడం ప్రారంభమైంది. మండలంలోని లింగంపల్లి, అమర్లబండ, భూంపల్లి, సదాశివనగర్ కొత్త చెరువు, ఉత్నూర్ తదితర చెరువుల్లోకి నీరు వస్తుందని తెలిపారు.

నిరుద్యోగులకు వృత్తి విద్యా కోర్సులో శిక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి

సెట్విన్ కింద వివిధ వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు టిటిఐ తెలంగాణ ప్రభుత్వ కోఆర్డినేటర్ సయ్యద్ మొయినాజద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో డిసిఏ, పి జి డి సి ఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సులలో శిక్షణ ఇవ్వబడుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత స్టడీ మెటీరియల్ తో పాటు కోర్స్ ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నరు. కోర్సు పూర్తి చేసిన తర్వాత సెట్విన్ ప్రభుత్వ సంస్థ ద్వారా ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 738618-046, 79891-59121 నెంబర్లు సంప్రదించాలని ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు

నవతెలంగాణ-నసురుల్లాబాద్/వర్ని/కోటగిరి/పొతంగల్

ఉమ్మడి జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నేత పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఒకరికి మించి ఒకరు పోటాపోటీగా రోడ్లపై భారీ ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మంగళవారం నసురుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలో సాయిబాబా మందిరంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్ ఆధ్వర్యంలో సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందిరం ఎదుట పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని అంగన్‌వాడి కేంద్రంలో, ఆసుపత్రిలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు

పురం వెంకటరమణ, ఇక్బాల్, మాజీ సొసైటీ చైర్మన్ మారుతి పటేల్, ప్రతాప్ సింగ్, మోహన్ పటేల్, ఏడే మోహన్ దుర్కి, మాజీ ఎంపిపి దుర్గం శ్యామల, మైసగౌడ్, భూమయ్య, మంగలి సాయిలు, గిర్మయ్య, భానుగౌడ్, జంగిలి శ్రీనివాస్, మండల పరిధిలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు బాన్సువాడ నియోజకవర్గంలో భాస్కర్ రెడ్డి చేస్తున్న సేవలు కొనియాడారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్, నాయకులు పత్తి లక్ష్మణ్, సిద్దు, నార్ల శ్రీనివాస్, ఆనంద్, తెల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ..

వర్ని(చందూర్) : ఉమ్మడి జిల్లాల మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన సందర్భంగా చందూర్ కాంగ్రెస్ మండల నాయకులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. వర్ని మండల కాంగ్రెస్ నాయకులు 1000 మందికి అన్నదానం చేశారు. మోస్రా రుద్రూర్ మండల నాయకులు భారీ కేక్‌లు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేష్ బాబా, చందూర్ జడ్పీటీసీ అంబర్‌సింగ్, పిఏసిఎస్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, మండలాధ్యక్షులు లక్ష్మణ్, పిట్ల శ్రీరాములు, పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి, సీనియర్ నాయకులు నేమాని వీర్రాజు, రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, వెలగపూడి గోపాల్, మైనారిటీ రాష్ట్ర నాయకులు ఎండీ భారీ, మాజీ కో ఆప్షన్ మెంబర్ ఖరీమ్, దండ్ల బాలరాజు, నామాల సాయిబాబా, శ్రీహరి, నేమాని బుజ్జి, నాగేశ్వరావు, వసంతరావు, రాజు శ్రీనగర్, శనిగరం కిషన్ పలు గ్రామాల యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండల కేంద్రంలో పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.



నసురుల్లాబాద్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వర్నిలో...

ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, మండల నోడల్ ఆఫీసర్లు, టిఎస్ఎంఎస్ ప్రిన్సిపాల్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతయ్య డిసిబి, పి. శ్రీనివాసరావు సమ్మిళిత విద్యాధికారి, జీవన్ ఏఎస్ఓ, సాయిలు సైన్స్ విద్యాధికారి, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎం.శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్


గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ మంగళవారం సందర్శించారు. గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. కేంద్రం, రాష్ట్రం నిధులు ఏ విధంగా ఉపయోగిస్తున్నారని, మహిళా సంఘాలకు రుణాలు, అంగన్వాడి కేంద్రాల నిర్వహణ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఎం సురేష్, పంచాయతీ సెక్రటరీ హారిక, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి : ఎంపీడీవో


మొక్కలను నాటుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ - భీంగల్ రూరల్

మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండలంలోని పల్లికొండ, బాచన్‌పల్లి గ్రామాలను గ్రామాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ మంగళవారం సందర్శించారు. పల్లికొండ గ్రామంలో గత సంవత్సరం పల్లె ప్రకృతి వనం సందర్శించి మొక్కల సంరక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లికొండ గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. బాచన్‌పల్లి గ్రామంలో సిబ్బందితో సమీక్ష చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఓ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శులు సంజీవ్, మోహన్ ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మాల్కాపూర్‌లో తీజ్


తీజ్ పండగలో పాల్గొన్న చిన్నారులు, గ్రామస్తులు

నవతెలంగాణ- నిజామాబాదు రూరల్

మండలంలోని మల్కాపూర్ తండాలో ఘనంగా తీజ్ పండుగ చేసుకున్నారు. మంగళవారం ఉదయం గ్రామం నడిబొడ్డున ఉన్న జగదాంబ, మాత సేవలాల్ మహారాజ్, రామారావు మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజ చేసి భోగ్ కార్యక్రమం నిర్వహించారు. పెళ్ళికాని ఆడపిల్లలు తొమ్మిది రోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆఖరి రోజు గోధుమల బుట్టలను చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్, మందిరం చైర్మన్ మున్ని నాయక్, నాయకులు మోతీ నాయక్, విట్టల్ నాయక్, సామ్యా నాయక్, గోవిందా కారోబారి, బానోత్ గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ ప్రజల మనిషి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైలు ప్రమాదంలో చనిపోయిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ నాయకులు, రాయల చంద్రశేఖర్ సంతాప సభ మంగళవారం నిర్వహించారు. గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి బట్టు కిషన్ హాజరై మాట్లాడారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సిపిఎంఎల్ మాస్ లైన్ జాతీయ నాయకుడిగాను ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ,కిసాన్ సంయుక్త మోర్చ జాతీయ నాయకుడిగా కొనసాగారని అన్నారు. ప్రజా ఉద్యమాలే వాళ్ల ఊపిరిగా బతికారన్నారు. ఆయన మరణించడం విప్లవోద్యమానికి తీరని లోటు తెలిపారు. ఆయన స్ఫూర్తితో మరింత ఐక్యంగా ప్రజా ఉద్యమాలను కొనసాగించాలని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పయనించాలని అన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు తలారి గంగాధర్, పుప్పలపల్లి సాయిలు, మనోహరాబాద్ రాజన్న ,అనిల్ కుమార్, నాయకులు తుర్పటి శ్రీనివాస్, నజీర్, చిన్నయ్య, ప్రజలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను నడపాలి


- ఆర్ఎంకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినతి



నవతెలంగాణ-నందిపేట్

మండల కేంద్రంలో ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడపాలని నందిపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మందమైపాల్ ఆర్టీసీ ప్రాంతీయ అధికారి జానీరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ బస్సులు సరైన సమయంలో లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒకేసారి వందల మంది విద్యార్థులు గుమి కూడడంతో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని అన్నారు. ఉదయం సాయంత్రం వేళ విద్యార్థులు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టిసి బస్సులను ఆర్ఎంను కోరారు. నందిపేట్-నిజామాబాద్ రూటు ఎప్పుడు ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని నిజామాబాద్ డిపోకు ప్రదాన ఆదాయ వనరుగా ఉందని అన్నారు. ప్రయాణికుల రద్దీ దృశ్య నందిపేట్ నిజామాబాద్ అదనపు బస్సులు వేసి ప్రత్యేకంగా రెండు ఎక్ప్రెస్ బస్సులను వేయాలని కోరారు. దీనికి ఆర్ఎం జానీరెడ్డి సానుకూలంగా స్పందించారని ఎక్ప్రెస్ బస్సులతోపాటు విద్యార్థుల కోసం ప్రత్యేక రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని చెప్పారని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



నవతెలంగాణ-ధర్పల్లి

ఇటీవల వర్షాలకు మండలకేంద్రంలోని రోడ్డు చిత్తడిగా మారింది. ఈ రోడ్లకు మంగళవారం గ్రామ కార్యదర్శి సైఫొద్దీన్ మరమ్మత్తులు చేపట్టారు. ఈసందర్భంగా తెలంగాణ తల్లి చౌరస్తా, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంతోపాటు గ్రామంలోని ప్రధాన వీధుల్లో చెడిపోయిన రోడ్లకు మరమ్మత్తులు చేపట్టుతున్నామని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీకుంటున్నామని తెలిపారు.

పంట పొలాలను కమ్మేసిన ఇసుక మేటలు

- ఇసుకను తొలగించేందుకు ఇబ్బందులు
- ఆర్థికంగా చితికిపోతున్న రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు కొన్ని పంట పొలాలను ఇసుక మేటలు కమ్మేశాయి. మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్ళే దారిలో లోలెవల్ కల్వర్టు వద్ద బీటి రోడ్డు కోతలకు గురవ్వడంతో వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన ఇసుక కల్వర్టు సమీపంలోని పంట పొలాల్లో మేటలు వేసింది. ఈ పొలాల్లో రైతులు ఇప్పటికే వేసిన వరి నాట్లు పూర్తి ఇసుకతో కప్పబడ్డాయి.మరికొందరు రైతులు వరి నాట్ల కోసం సిద్ధం చేసుకున్న వరి నారుమడులు వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయాయి. భారీగా కురిసిన వర్షంతో వరద ప్రవాహానికి కొట్టుకు వచ్చిన ఇసుక, మట్టి, గులక రాళ్ళు పంట పొలాల్లో మేటలు వేసింది. వరి పంట పొలాల్లో ఇసుక, మట్టి కమ్మేయడం రైతులను కంటతడి పెట్టిస్తున్నాయి. అడుగు ఎత్తు మేర ఇసుక మేటలు వరి నాట్లను కప్పేశాయి. ఇసుక మేటలతో తమ పంటలు


పొలాలను కమ్మేసిన ఇసుక

దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల పంట పొలాల్లో మట్టి పేరుకుపోయింది. పంటలను కప్పేసిన మట్టిని బ్లేడ్ ట్రాక్టర్‌తో తొలగించుకునేందుకు అవకాశం ఉంది. తిరిగి వెంటనే మళ్ళీ పంటలు వేసుకోవచ్చు. కానీ ఇసుక మేటలను తొగించేందుకు రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే వేసిన పంటలు చేతికి రాకుండా పోగా, ఇసుక మేటలను తీసేందుకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట పొలాలను మళ్ళీ సాగు సిద్ధం చేయాలంటే ఇసుక మేటలు తొలగించాలి. ఇసుకు మేటలు తీసేందుకు వేలల్లో ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. మళ్ళీ విత్తేందుకు వరి నారు కొనుగోలు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగా వరి నాట్లు వేస్తే పంట చేతికి వచ్చే సమయం ముందుకు వెళ్లడంతో తరువాత వేసే పంటపై ప్రభావం పడుతుందని రైతులు అంటున్నారు.ఇసుక మేటలు, మట్టి మూలంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు

బడ్జెట్‌లో ఉపాధి హామీకి మొండిచేయి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గ్రామీణ పేదల ఆహార భద్రతకు, గ్రామీణ ఉపాధి హామీకి కేంద్ర బీజేపీ ప్రభుత్వ బడ్జెట్ మొండి చేయి చూపించింది. పార్లమెంట్ లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గ్రామీణ పేదలకు రైతాంగానికి రాయితీలను కుదించి, బడా కార్పొరేట్లకు రాయితీలను ప్రకటించడం ఆందోళన కలిగిస్తుంది. ఆహార పదార్థాల ధరలు 3.5శాతం నుండి 7.5శాతం పెరిగాయన్న ప్రభుత్వం వాటిని నియంత్రణ చేయడానికి ఎలాంటి చర్యలు బడ్జెట్లో చేపట్టలేదు. పైగా తెల్ల రేషన్ కార్డు దారులకు ఇచ్చే ఆహార సబ్సిడీ గత సంవత్సరం రెండు లక్షల 12 కోట్లు కేటాయించగా ఈసారి రెండు లక్షల ఐదు కోట్లకు తగ్గించడం అంటే ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణ బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకో బోతుందని అర్థం అవుతుంది. గ్రామీణ ఉపాధి పనికి కనీసం 2 లక్షల 40 వేల కోట్లు కేటాయించాలని మేధావులు కోరుతున్న దానిని పట్టించుకోలేదు. గత సంవత్సరం కేటాయించిన 86 వేల కోట్లను తిరిగి కేటాయించడం అంటే పని కోసం పెరుగుతున్న గ్రామీణ ప్రాంత వలసలను నివారించాలని చిత్త శుద్ధి ప్రభుత్వానికి లేదని స్పష్టం అవుతుంది. గ్రామీణ ఉపాధి పని దినాలను 200 రోజులకు పెంచి ఆంక్షలు లేకుండా రోజుకు 600 రూపాయలు కూలి ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల పేదలకు పనిని విస్తరించాలన్న డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ బడ్జెట్లో మార్పులు చేయకుంటే ఆందోళన తప్పవు.

గ్యారంటీలు, హామీలపై నిలదీస్తాం..

- బిజెపి ఎమ్మెల్యేలు
- ట్యాంక్‌బండ్ నుంచి పాదయాత్రగా అసెంబ్లీకి


అసెంబ్లీకి వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ సర్కార్ నిరుద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బిజెపి ఎమ్మెల్యేలు మంగళవారం హైదరాబాద్‌లో నిరసన చేపట్టారు. మొదట వారు ట్యాంక్ బండ్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి పాదయాత్రగా గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు 420 హామీలతో అధికారంలోకి వచ్చిందని అనానరు. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా డిసెంబర్ 9న రైతన్నలకు ఏక కాలంలో 2లక్షల రుణమాఫీ చేస్తానని ఇప్పుడు అనేక ఆంక్షలతో కొంత మందికే లక్ష రుణమాఫీ చేయడాన్ని బిజెపి పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఏక కాలంలో 2 లక్షల రుణమాఫీ చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అలాగే వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలను అమలు చేయాలనీ ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ నిరుద్యోగ యువత ఉపాధి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వారి కళ్ళలో కారం కొట్టె ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. పూర్తిస్థాయిలో నోటిఫికేషన్ వేయకుండా జాబ్ క్యాలండర్ విడుదల చేయకుండా రెండు లక్షల ఉద్యోగాలు ఏడాదిలోపు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని రేవంత్ సర్కార్ పై మండిపడ్డారు భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా ఇచ్చిన యువ డిక్లరేషన్ అమలు చేయాలనీ, జాబ్ క్యాలండర్ వెంటనే విడుదల చేయాలనీ వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో సమావేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తాం.. కాంగ్రెస్ గ్యారంటీలు, హామీలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాం అని అన్నారు.

రాష్ట్రస్థాయి వాణిజ్యంలో టీయు కామర్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రస్థాయి వాణిజ్యంలో కామర్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయిలో ఉస్మానియా యూనివర్సిటీ లోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఎంకాం విద్యార్థులకు ప్రతి ఏటా నిర్వహించే వాణిజ్య సదస్సు ఈనెల 19-20 తేదీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో తెలంగాణ వర్సిటీకి చెందిన ఎంకాం విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి పలు బహుమతులు సాధించారు. సోలో డాన్స్‌లో ఆర్. గంగోత్రి మొదటి బహుమతిని పొందగా గ్రూప్ డాన్స్‌లో డి. రాము బృందం ద్వితీయ బహుమతి పొందారు. వ్యాపార ప్రణాళిక తయారీలో బి.గోపాల్, హర్షవర్ధన్ ప్రత్యేక బహుమతితో పాటు కేస్ స్టడీస్ లో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ పోటీల్లో అత్యున్నత ప్రతిభ పాటవాలను ప్రదర్శించి విజేతలుగా నిలిచిన విద్యార్థులు ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు తమ ప్రతిభా పాతవాలు ప్రదర్శించి అధిక మొత్తంలో బహుమతులు గెలుచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులను సమాయత్తం చేసి విద్యార్థులను వెన్నంటి ఉండి ప్రోత్సహించిన కామర్స్ విభాగాధిపతి, డీన్ ప్రొఫెసర్ డాక్టర్ బాబు


సాధించిన బహుమతులతో విద్యార్థులు

ని ప్రత్యేకగా అభినందించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ జి శ్రీనివాస్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ శ్వేత ఓ.రాజు ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని ముబారక్ నగర్‌కు చెందిన కలకుంట్ల రాజయ్య (46) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మహేష్ వివరాల ప్రకారం.. కూలి పని చేసే రాజయ్య ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈనెల 11న ఇంటి నుండి వెళ్లి సాయంత్రం యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని గాంధీకి అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించి మంగళవారం రాజయ్య మృతి చెందాడు. మృతుని కుమారుడు కలకుంట్ల రాజశేఖర్ నిజామాబాదు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ మహేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిపీగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ


పిపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జి.రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో నిర్మల్ కోర్ట్ పీపీ గా విధులు నిర్వహించిన జి.రామకృష్ణ ప్రస్తుతం పట్టణ కోర్ట్ పబ్లిక్ ప్రసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా పీపీ బాధ్యతలు చేపట్టిన జి.రామకృష్ణ ను రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, డిచ్ పల్లి సీఐ మల్లేష్,భీంగల్ సీఐ నవీన్ కుమార్, టౌన్ ఎస్ ఐ అశోక్, గంగాధర్, హరిబాబు, రాజశేఖర్, మచ్చేందర్ అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐ లు, కోర్టు సీనియర్, జూనియర్ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

హాస్టల్ అకస్మీక తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన రిజిస్ట్రార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని ఓల్డ్ బాయ్స్ హాస్టల్ ను మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.అనంతరం హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి వంట గదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ ఉండకుండా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. దోమల నివారణకు కిటికీలకు జాలీలను సరి చేయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నాణ్యమైన భోజనం అందించడంలో హాస్టల్ సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యార్థులకున్న సమస్యలను సావధానంగా విని పరిష్కారాలను చర్చించారు. కార్యక్రమం లో ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్, ఇంజనీర్ వినోద్, చీఫ్ వార్డెన్ డాక్టర్.మహేందర్ ఐలేని, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్ వర్ధన్ రెడ్డి, కేర్ టేకర్స్ క్రాంతి కుమార్, దిగంబర్ చౌహాన్, రమేష్, హాస్టల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎఎస్ అధికారి స్మిత సబర్వాల్‌ను సర్వీస్ నుండి తొలగించాలి

- బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలో గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో కీలకమైన పాత్ర పోషించిన ఐఎఎస్ అధికారిణి స్మీతా సబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆమెను ప్రభుత్వ సర్వీస్ నుండి రిలీవ్ చేయాలని, కేంద్రం ప్రభుత్వం జోక్యం చేసుకొని సబర్వాల్‌ను ఐఎఎస్ సర్వీస్ నుండి తొలగించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఒక ఐఎఎస్ అధికారి స్మీతా సబర్వాల్ తన స్థాయిని దిగజారి దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిన ఘటనగా భావించి ఆమెపై వెంటనే కేసు నమోదు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ నుండి రిలీవ్ చేయాలని, కేంద్రం ప్రభుత్వం ఐఎఎస్ అధికారిణి సర్వీస్ నుండి తొలగించాలని దండి వెంకట్ డిమాండ్ చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఏసిపి బస్వారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏసిపి బస్వారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్మెంట్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ రమేష్, మున్సిపల్ చైర్మన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, వైస్ చైర్మన్ మున్ను , ఆకుల రాము, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్ట్ 4,5న శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆగస్టు 4, 5న జరిగే సిపిఐ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కార్యాలయంలో మంగళవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రాజకీయ శిక్షణ తరగతులు రెండు రోజులపాటు నిజామాబాద్ నగరంలో జరుగుతాయని, ఈ శిక్షణ తరగతులకు మొదటి రోజు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కామ్రేడ్ కునంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కామ్రేడ్.పశ్య పద్మ, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై శిక్షణ తరగతులు ఉంటాయని అన్నారు. రెండు జిల్లాల సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ ప్రెస్ మీట్‌లో సిపిఐ జిల్లా నాయకులు వై ఓమయ్య, కె రాజన్న రంజిత్, నర్సింగ్ రావు, ఆనంద్ పాల్గొన్నారు

ఈరవత్రికి ఘనంగా సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎన్నికైన శుభ సందర్భంగా పద్మశాలి ముద్దుబిడ్డ ఈరవత్రి అనిల్‌ను పద్మశాలి ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ తరపున మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో రుద్ర గణపతి, చౌటి భోజదాస్, మైసల సత్యనారాయణ, చౌకే వరప్రసాద్, బాస దేవిదాస్, ఆసమ్ నవీన్, చిలుక శ్రీనివాస్, డాక్టర్ వన్నెల్‌దాస్ శ్రీనివాస్, దాసరి మురళి పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

- ఎస్సారెస్పీకి 25 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నవతెలంగాణ-నిజామాబాద్/నాగిరెడ్డిపేట్/జుక్కల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు పలు ప్రాజెక్టులకు వరద వచ్చి చేరుతోంది. ఉత్తర తెలంగాణ వరదప్రదాయిని ఎస్సారెస్పీకి 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.

అదే విధంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి మంగళవారం ఇన్ ఫ్లో కొనసాగుతున్నట్లు ఇరిగేషన్ ఈ ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టులోకి 127 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 7.6 అడుగుల మేర నీరు ఉన్నట్లు డిఈఈ తెలిపారు.

కౌలాస్‌నాళాకు ఇన్‌ఫ్లో నిల్

జుక్కల్ : మండలంలోని కౌలాస్ నాళా ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టుకు నీరు రావట్లేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 458 మీటర్లు (1.237 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 454.40 మీటర్ల (0. 535 టీఎంసీ) నీరు నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రవి శంకర్ తెలిపారు.

ఎంపీవో మారుతికి ఘనంగా వీడ్కోలు

నవతెలంగాణ-కోటగిరి


ఎంపీవోను సన్మానిస్తున్న పలువురు

కోటగిరి ఎంపీవో మారుతి వర్ని మండలానికి బదిలీ కావడంతో కోటగిరి మండల కార్యాలయంలో ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విట్టల్, మండల సిబ్బంది ఎంపీవో బి.మారుతీకి మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి మండలంలోని 28 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏపీవో గంగారం, కంప్యూటర్ ఆపరేటర్స్, ఉపాధి హామీ సిబ్బంది, కారోబార్స్ మండలంలో 6 సంవత్సరాలు అనేక సేవలు అందించినందున ఘనంగా సన్మానించారు.

గాంధారి మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

నవతెలంగాణ-గాంధారి



మండలంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం పర్యటించారు. గాంధారి గ్రామ పంచాయతీ ఐకేపీ భవనంలో స్కూల్ యూనిఫాంలను స్టిచింగ్ పరిశీలించారు. గాంధారిలోని బస్టాండ్‌కి దగ్గరలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసే క్యాంటింగ్‌ను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో శానిటేషన్‌ను పరిశీలించారు. బస్టాండ్ శానిటేషన్ పనులు ఎప్పటికప్పుడు చేయించాలని కామారెడ్డి డిఎంకు పంచాయతీ కార్యదర్శి సూచించారు. గాంధారి రోడ్డుకు మధ్యలో మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం ఇతర పనులను పరిశీలించారు.

ఉత్సవ విగ్రహంలా సమీకృత భవనం

- పనులు పూర్తిచేయడంలో జాప్యం
- ఎమ్మెల్యే పోచారం ఆదేశాలు బేఖాతర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్



పనులు పూర్తికాకపోవడంతో నిరుపయోగంగా మారిన సమీకృత సముదాయ భవనం

మండల ప్రజలకు మెరుగైన సేవలను వేగంగా అందడంలో భాగంగా అధికారులకు అవసరాలకు తగ్గట్టుగా అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండల సమీకృత సముదాయ భవనం నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కోట్ల రూపాయలతో నిర్మించిన మండల సమీకృత సముదాయ భవనంలో ఉత్సవ విగ్రహంలా కనిపిస్తుందని మండల ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

బాన్సువాడ నియోజకవర్గంలోని నసురుల్లాబాద్ మండల సమీకృత సముదాయ భవనం కోసం మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపి నిధులు మంజూరు చేశారు. ఆగస్టు 2021లో కోటి రూపాయలతో భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణం పనులు జాప్యం జరగడంతో అదనంగా మరో 30 లక్షలు నిధులను కేటాయించడం జరిగింది. భవన నిర్మాణానికి కోటి 30 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. కానీ కొన్ని పనులు పూర్తిగా కాకపోయినా అక్టోబర్ 2023లో అప్పటి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మండల సమీకృత సముదాయ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. చిన్న చిన్న పనులు పూర్తిచేయాల్సి ఉండగానే ప్రారంభించారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భవనాన్ని ప్రారంభించి 10 మాసాలు అవుతున్నప్పటికీ ఇప్పటికీ అధికారులు ఆ భవనంలోకి వెళ్ళలేదు. మండల సమీకృత భవనంలో తహసిల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ, ఉపాధి హామీ, గ్రామపంచాయతీ, విద్యాశాఖ కార్యాలయాల కోసం ఏర్పాటు చేసిన భవనం ఉత్సవ విగ్రహంలా కనిపిస్తుంది. ఇప్పటికీ ఇంకా చిన్న చిన్న పనులు చేయవలసి ఉందని తెలిసింది.

పనులు పూర్తికాకుండానే.. రెండుసార్లు ప్రారంభోత్సవం

మండల ప్రజల సౌకర్యార్థం మండల సమీకృత సముదాయ భవనం పనులు పూర్తికాకుండానే ఒకసారి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించగా 4 జూన్ 2024న ఎంపీపీ పాల్త్య విట్టల్ ప్రారంభించారు. మండల సమీకృత భవనం పూర్తి కాకుండానే ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. గత మూడు సంవత్సరాల నుంచి మండల సమీకృత భవనం పనులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మాజీ ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మండల రెవెన్యూ కార్యాలయం నసురుల్లాబాద్ సొసైటీ భవనంలో కొనసాగుతుంది.

చాలీచాలని గదులు ఇరుకుగా గదుల్లో కార్యాలయం కొనసాగుతుంది. ఒక అధికారి కూర్చుంటే మరో అధికారి నిల్చుండే పరిస్థితి ఏర్పడింది. ఎంపీడీవో కార్యాలయం ఇరుకు గదుల మధ్య కొనసాగుతుంది. విద్యాశాఖ భవనం ఉన్నప్పటికీ ఓ ప్రభుత్వ పాఠశాల ఇరుకు గదిలో ఎంఈఓ కార్యాలయం కొనసాగుతుంది. మండల సమీకృత భవనం పనులు పూర్తయి సమీకృత భవనంలో అన్ని కార్యాలయాలు అక్కడికి చేరితే మండల ప్రజలకు అన్ని సౌకర్యాలు సదుపాయాలు కలుగుతాయనే ఆశలు అడిఆశలుగానే మిగిలిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి మండల సమీకృత సముదాయ భవనంలోకి అన్ని కార్యాలయాలు వచ్చేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు ఇసుక వేలం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన 12 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పోతంగల్ బైపాస్ రోడ్‌లో గల శ్రీ వీరభద్ర దేవాలయం వద్ద ఇసుకను వేలం వేయనున్నట్టు తహసీల్దార్ మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు రూ.3000 డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చునని సూచించారు.

బీజేపీ మండల కార్యవర్గ నాయకుల సమావేశం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుబీమా పథకానికి ఆగస్టు 5లోగా దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రైతు బీమా పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారి హరీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొంది ఈ సంవత్సరం జూన్ 28 వరకు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వరకు వయసు గల రైతులు రైతుబీమా పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

మద్నూర్‌లో బోనాల పండుగ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో మంగళవారం కొన్ని మున్నూరు కాపు బేడలు బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బోనాల పండుగకు ఒక బేడలోని మహిళలు యూనిఫామ్‌తో బోనాలు ఎత్తుకొని ఊరేగింపు చేపట్టారు. మద్నూరు మండల కేంద్ర మున్నూరు కాపు ముద్దుబిడ్డ పశువైద్య డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

పిల్లల ఆహార అలవాట్లపై అవగాహన

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటలో అంగన్‌వాడి కిశోర బాలలకు, తల్లులకు ఆహార అలవాట్లపై యుని సేవ్ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. అంగన్వాడీలో అక్షరాభ్యాసం, అన్నప్రసన్న నిర్వహించారు. కార్యక్రమంలో యునిసేవ్ కోఆర్డినేటర్, సిడిపిఓ శ్రీలత, సూపర్వైజర్ ఉమా, ఆశాలు, అంగన్వాడీ టీచర్, సిబ్బంది, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో జీపీ సెక్రెటరీ హరీష్, ఎఫ్‌ఏ బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్, ఈసీ స్వామిదాస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాలలో నిర్వహిస్తున్న మన వనం కార్యక్రమంలో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం గుంతల పరిశీలన, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం, పెంపకం గ్రామస్తుల సహకారంతో చేపట్టాలని అన్నారు. అనంతరం గ్రామాలలో దోమల బెడదను నివారించేందుకు వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి హరీష్, టీఏ బాబు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాలు వేరు.. పెట్రోలూ వేరు

- ఏది నాణ్యతదో తెలియక అయోమయం
- బంక్‌లపై నిఘా పెట్టాలంటున్న ప్రజలు

నవతెలంగాణ-మద్నూర్



తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలు వేరైనా.. పెట్రోలు రంగుల్లోనూ తేడా కనిపిస్తోంది. దీంతో వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మద్నూర్ మండలం మహారాష్ట్ర ప్రాంతానికి పూర్తిగా సరిహద్దులో ఉంది. మద్నూర్ మండలం మహారాష్ట్రలోని దెగ్లూరు పట్టణం పూర్తిగా కలిసి ఉన్నట్లే ఉంటాయి. అయితే రెండు రాష్ట్రాల్లో పెట్రోల్ రంగులో మాత్రం తేడా కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్ ధర కంటే మహారాష్ట్రలో పెట్రోల్ ధర రూ.3-4 తేడా ఉంది. మన రాష్ట్రంలో అధికంగా ఉంటే మహారాష్ట్రలో పెట్రోల్ ధర లీటర్‌కు నాలుగు రూపాయలు తక్కువగా ఉన్నట్లు వాహనదారులు తెలుపుతున్నారు. రాష్ట్రాలు వేరైనా పెట్రోల్ రంగుల్లో తేడా కనిపించడం, మైలేజీ తక్కువగా ఇవ్వడంతో ఏ పెట్రోల్ నకిలీదీ.. ఏ పెట్రోల్ నాణ్యత గలదనే సందేహంలో ప్రజలు ఉన్నారు. పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించేలా సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

- బివిఎం రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్

నవతెలంగాణ-కామారెడ్డి

త్వరలో జరగబోతున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో ప్రధానంగా విద్యారంగ సమస్యలపైన చర్చించాలని భారతీయ విద్యార్థి మోర్చ (బివిఎం) రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ నాయకులు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని తెలిపారు. స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం గురుకులాల సమస్యలు పట్టించుకోకపోవడం, వసతి గృహాలను అభివృద్ధి చేయకపోవడం, యూనివర్సిటీలను గాలికి వదిలేశారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయకూడదని గుర్తుచేశారు. పెండింగ్లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్‌షిప్స్, రియింబర్స్‌మెంట్ రూపాయలను వెంటనే ఎలాంటి షరతులు పెట్టకుండా విడుదల చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్, మెస్‌చార్జీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు సొంత భవనాల నిర్మించాలని అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకునే దిశగా అడుగులు వేయాలని శిథిలావస్థలో ఉన్న పాఠశాల కళాశాల భవనాలను కూల్చివేసి ఆ స్థానంలో నూతన భవనాలను నిర్మించాలన్నారు. విద్య రంగానికి 30 శాతం నిధులు కేటాయించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. లేనిపక్షంలో భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవితేజ, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షులు అర్బాస్ ఖాన్, జిల్లా ఇంచార్జ్ బుల్లెట్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన గొర్రెల కాపరి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన జీర్ల చిన్న మల్లయ్య (53) అనే గొర్రెల కాపరి హత్యకు గురయ్యాడు. ఆయన మృతదేహం మంగళవారం లభ్యమైంది. సదాశివనగర్ తహశీల్దార్ గంగసాగర్, సి.ఐ సంతోష్ కుమార్, ఎస్సై రాజు సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణ అనంతరం వివరాలు వెల్లడించే అవకాశముంది.

నాగిరెడ్డిపేట్ ఎంపీవోగా ప్రభాకర్ చారి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్



నాగిరెడ్డిపేట్ ఎంపీవోగా ప్రభాకర్ చారి బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో పర్బన్న మంగళవారం తెలిపారు. లింగంపేట్‌లో ఎంపీవోగా విధులు నిర్వహించిన ప్రభాకర్‌చారి బదిలీపై నాగిరెడ్డిపేట్ ఎంపీవోగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీఓను సన్మానించిన గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామంలో గాంధారి మండలం నుండి భిక్కనూర్ మండలానికి బదిలీపై వచ్చిన ఎంపీఓ రాజ్‌కిరణ్ రెడ్డిని మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. అలాగే బదిలీపై గ్రామానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి నవీన్, బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి సౌజన్యను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాల కోసం మొక్కలు నాటాలి

- అధికారులు సిబ్బంది సమయపాలన పాటించాలి
- బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బాన్సువాడ ఆర్డిఓ రమేష్ రాథోడ్ అన్నారు. మంగళవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో అంగన్‌వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ హైస్కూల్, గ్రామపంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇబ్రహీంపేట్‌లో ఉన్న నర్సరీలో ఉన్న మొక్కలను ఆయన పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సకాలంలో ఉండి ప్రజలకు సేవలు అందించాలన్నారు. వాతావరణ మార్పుల సందర్భంగా విషజ్వరాలు డైర్య లాంటి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. గ్రామంలో పారిశుధ్య లోపం లేకుండా గ్రామపంచాయతీ సిబ్బంది కృషి చేయాలన్నారు. మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు సిబ్బంది సమయపాలన పాటించి గ్రామాల్లో సేవలందించాలన్నారు. మండలంలోని కొత్తబాది గ్రామంలోని ఉన్నత పాఠశాలను సందర్శించిన సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఆర్డిఓ మొక్కలను నాటారు. నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పచ్చదనం పెంచేందుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరని తెలిపారు. పాఠశాలలో నాటిన మొక్కలను ఉపాధ్యాయులు విద్యార్థులు తప్పకుండా వాటిని సంరక్షించే బాధ్యత పాఠశాల ఉపాధ్యాయులపై ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ లత, పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఎస్ఐ సందీప్

నవతెలంగాణ-కోటగిరి

విద్యార్థులు గంజాయి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సందీప్ అన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీస్ కళా బృందం వారి ఆధ్వర్యంలో కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని చక్కని నాటిక, పాటలతో మంగళవారం ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సమాజంలో ఆన్లైన్లో ద్వారా జరుగుతున్న మోసాలు, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ వర్సెస్ మున్సిపల్ సిబ్బంది

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

విద్యుత్ శాఖ సిబ్బంది మున్సిపల్ సిబ్బందికి మధ్య సమన్వయం లేకుండా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం పాత ప్రభుత్వాసుపత్రి వెనకాల విద్యుత్ తీగల లైన్‌ల కింద మొక్కలు నాటుతున్న మున్సిపల్ సిబ్బందిని విద్యుత్ తీగల లైన్ కింద మొక్కలు నాటొద్దని, అవి పెరిగి విద్యుత్ తీగలకు తగులుతాయని విద్యుత్ శాఖ లైన్‌మెన్లు చెబుతున్నా.. మున్సిపల్ సిబ్బంది వినకుండా మొక్కలు నాటుతున్నారని, గతంలో చెప్పినా పట్టణంలో పలుచోట్ల ఇలాగే మొక్కలు నాటారని విద్యుత్ శాఖ సిబ్బంది ఆరోపిస్తున్నారు. వీరు ఇరువురు సమన్వయంతో వ్యవహరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు అంటున్నారు.

బడ్జెట్లో తెలంగాణకు మొండిచెయ్యి

- 8 మంది ఎంపీలను మరచిన ప్రభుత్వం
- మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ 2024-25లో తెలంగాణకు ప్రత్యేకంగా నిధుల కేటాయింపులేమీ జరగలేదని మార్కెట్ కమిటీ చైర్మన్ పెర్క శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నసూరుల్లాబాద్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దర్గా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉన్న సంగతి బిజెపి ప్రభుత్వం మర్చిపోయిందని అన్నారు. ఎన్డీయే భాగస్వాములైన ఏపీ, బీహార్‌తో పాటు అస్సాంకు ప్రాధాన్యం కనిపించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైలు మార్గాలు లేని జిల్లాలకు కొత్త ట్రాక్లు వస్తాయనే ఆశలు మరోసారి అడియాసలయ్యాయని తెలిపారు. బడ్జెట్ ప్రసంగంలో తెలంగాణ ఊసే ఎత్తలేదన్నారు. మాజీ ఎంపీపీలు శ్యామల శ్రీనివాస్, పాల్త్య విఠల్, నాయకులు ప్రతాప్ సింగ్ రాము తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చేయూత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో మరణించి అవయవ దానం చేసిన ప్రవీణ్ కుటుంబానికి భిక్కనూర్ మండల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మానవతా దృక్పథంతో ప్రవీణ్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు సుదర్శన్, క్లబ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారాఫిట్ వాల్ పనులు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని లింగంపల్లి కలాన్‌లో పోచారం ప్రధాన కాలువపై నిర్మించిన బ్రిడ్జిపై ఏర్పాటు చేస్తున్న పారాఫిట్ వాల్‌ను మంగళవారం ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జ్‌పై ఇరువైపులా పారాఫిట్ వాల్ నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. పనులు నాణ్యత లోపం లేకుండా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు.

అమ్మ మాట అంగన్వాడీ బాట

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో అమ్మ మాట అంగన్వాడి బాట అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి పేర్కొన్నారు. దీనిలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అక్షరభ్యాసం, మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. గర్భిణులు సకాలంలో తమ పేర్లను అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయించుకొని పౌష్టికాహారాన్ని పొందాలని ఆమె సూచించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా అందించాలని, అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు. ఐఏపీసీసీలు శ్యామల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మద్యం సిట్టింగ్ నిర్వహిస్తే చర్యలు

నవతెలంగాణ-భిక్కనూర్

44వ జాతీయ రహదారిపై ఉన్న దాబా హోటల్లలో మద్యం సిట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సంపత్ కుమార్ దాబా హోటల్ నిర్వాహకులకు హెచ్చరించారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి దాబా హోటల్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. మద్యం సిట్టింగ్ నిర్వహించ వద్దని, దాబా హోటల్ ముందు రోడ్డుపై లారీలు పార్కింగ్ చేయకుండా చూడాలని తెలిపారు. ఎస్సై సాయికుమార్, దాబా హోటల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.